


# కన్నీరింకని కథలు

## - షర్మిల



**చీకటి లోయల్లోకి** కూరుకుపోతున్నట్టు. కళ్ళు తెరవాలన్నా వీలుకాని మత్తు. కర్ణకఠోరమైన శబ్దాలు. ఠంగ్ ఠంగ్

లేవాలి ... లేవాలి మెదడుకి ఆదేశాలు ముడుచుకున్న మొగ్గ రేకుల్ని బలవంతంగా విప్పినట్టు కళ్ళు విచ్చుకున్నాయి.

“అమ్మా !” అనబోయింది. గుర్తొచ్చింది తనెక్కడుందో.

మళ్ళీ ఠంగ్ ఠంగ్ ... కావ్యకి పూర్తి మెలకువలోకి వచ్చింది. తను అత్తారింట్లో వుంది. వుంటే ఏంటి ! అయితే ఏంటి ? సో వాట్ ?

ఇది ఇంతకు ముందు తను అనే మాటలే !

"ఒరేయ్ ! దాన్ని అంత గారాం చెయ్యకురా అత్తారింటికి వెళ్ళాల్సిన పిల్ల ... అక్కడ కష్టపడుతుంది ."

"తాతా మీకు చాదస్తమా ! అసలు నేను ఎందుకు అత్తారింట్లో ఆరళ్ళు పెట్టించుకుంటాను. అసలు అత్తలు అంటే ఆరళ్ళు పెడతారా ? పైగా నా హబ్బీ తో బెంగుళూరో యూకేనో, యూఎస్సో ఎగిరిపోతాను "

కిల కిల మని నవ్వు!

మరిదేంటి? బుగ్గల మీదుగా కన్నీళ్ళు?

లేచి బ్రష్ చేసుకుని నైట్ డ్రెస్ మార్చుకుని బయటకి వచ్చింది.

ఇంట్లో అమ్మ పోరినా మధ్యాన్నం వరకూ వదలని నైట్ డ్రస్ ఇప్పుడు చచ్చినట్టు మార్చుకుంటుంది, లేకపోతే ఆంటీ చూపులతో కాల్చేయ్యెదూ!

రాత్రంతా నిద్ర రాదు! మనకి రాత్రి అమెరికాకి పగలు కదా రాజేష్ కి ఫోన్ చేస్తూవుంది.

ఎప్పట్లానే ఫోన్ వాయిస్ మెయిల్ కి వెళ్ళిపోయింది.

తెల్లరెప్పుడో నిద్ర పట్టింది. 8 గంటలకి మెలకువ వచ్చింది. కిచెన్ లోకి వెళ్ళి కాఫీ కలుపుకుంటోంది.

గిన్నెలు మళ్ళీ ఠంగ్ ఠంగ్!

గిన్నెలు కూడా మాట్లాడతాయా? పోట్లాడతాయా? చిన్న నవ్వు రాబోయి ఆంటీ మాడు మొహం చూడగానే మాయమైంది.

“ఆంటీ! మీకు రాజేష్ ఫోన్ ...” ఇంకా ఏదో అడగబోయిన కావ్య మాట పూర్తి కానియ్యకుండా “ఇవ్వాళ లక్ష్మి రాలేదు... హౌస్ క్లీనింగ్ మనమే చేసుకోవాలి!”

అంటే ఇల్లు వూడ్చి తడిగుడ్డతో తుడవాలి.

తను వచ్చిన ఈ నెలలో పది సార్లు అయినా లక్ష్మి రాలేదు, ఈ పనులన్నీ తను చెయ్యాల్సిందే.

వాషింగ్ మెషీన్ వాడరట, బట్టలు వదలవట. చచ్చినట్టు ఆమె వుతికితే తను జాడించి ఆరెయ్యాలి.

మళ్ళీ తన బట్టలు వేరే వుతుక్కోవాలి. ఇవన్నీ చేసే సరికి అలవాటు లేక నీరసం.

బీటెక్ డిస్టింక్షన్ లో పాసై ఎమ్మెస్ కి వెళ్తానంది. అన్నయ్య అమెరికా వెళ్ళి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాడు.

“నీకూ పెళ్ళి చేస్తే మాకు బాధ్యత తీరిపోతుంది. మంచి సంబంధం వచ్చిందమ్మా కుర్రాడు సాఫ్ట్వేర్ ఉద్యోగం.

నువ్వు అక్కడికి  వెళ్ళి ఎమ్మెఎస్ చేసుకుందు గాని తల్లీ” అని నాన్న బతిమాలాడు.

“నిన్ను చదివించినా మళ్ళీ పెళ్ళి ఖర్చు తప్పదు.  మనకి అంత స్తోమత లేదే” అని తల్లి. సరే ఏం చేస్తాను సర్లే అని అడ్జెస్ట్ అయ్యింది. ఏవేవో ప్లానింగ్లు,  ఫ్యూచర్ మీద ఎనలేని ఆశలు...

తండ్రి సురేంద్ర ఫెర్రో ఎల్లాయిస్ ఫాక్టరీలో క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్. ఆయనకొచ్చే  జీతం తమ చదువులకి ఇంటి ఖర్చులకి సరిపోయింది.

తాత ఇచ్చిన పొలం అమ్మి ఇల్లు కట్టారు. మిగతా పొలం అమ్మి తన పెళ్ళి ఘనంగా చేశారు.

రమ తన నగలు మార్చి కూతురికి కొత్తవి కొంది.

"అమెరికా సంబంధం చౌకలోనే కొట్టేశారు"అనే ఫ్రెండ్స్ మాటలకు అమ్మా నాన్న మొహంలో ఆనందం చిందులేసింది .

తనకు మాత్రం గర్వం అనిపించలేదూ. పెళ్ళి అయినప్పటి నుంచి ఆశాభంగాలే.

పెళ్ళి పేరుతో జంటగా మారిన  ఒక అపరిచితమైన వ్యక్తిని సర్వస్వంగా భావించాలనే ఉద్బోధలతో  పెరిగింది.

అందుకే ఆ రాత్రి ఎంతో ప్రేమతో అతనికి సమీపంగా వెళ్ళింది.

ఆమె ఊహించినట్టు జరగలేదు

" సారీ. నన్ను ఒదిలెయ్ కొంచం టైం కావాలి "అని పక్కకి తిరిగి పడుకున్నాడు.

22 ఏళ్ళ యువతి ఇంకా పసితనం వీడని మనసు. ఎదురుదెబ్బ తిన్నట్టు అనిపించింది.

ఆ తర్వాత రోజు బట్టలు సర్దుకుంటున్నాడు రాజేష్.

"అదేంటి ఎక్కడికి వెళ్తున్నాం?" అంది ఉత్సాహంగా.

"నాకు అర్జెంట్ గా ఆఫీస్ పని పడింది బెంగుళూర్ వెళ్తున్నా "అన్నాడు.

అత్తారింట్లో వున్న శ్రావ్య తండ్రికి ఫోన్ చేసినప్పుడు ఈ సంగతి చెప్పింది.

"బాబూ ఇద్దరూ వెళ్ళి రండి.. నేను టిక్కెట్లు బుక్ చేయిస్తాను "అన్నాడు.

అదే మహాపరాధం అయ్యింది.

"మీ బాబు టిక్కెట్లు చేయించకపోతే మాకు దిక్కు లేదనుకున్నాడా ?"అని అత్తగారు నానా గొడవ చేసింది.

రాజేష్ రాయిలా కఠినమైన మొహం పెట్టుకుని ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

తరవాత వారానికి ఫోన్ చేశాడు.

"నేను యూఎస్ వెళ్తున్నా "అని మరి నేను అంది.

" నేను పేపర్స్ పంపుతాను వీసాకి వెళ్దువుగాని" అని పెట్టేశాడు అంతే .

ఆనాటి నుంచి ఫోన్ లేదు. పెళ్ళయిన పది రోజులకే ఇంటికి తీసుకొస్తే బాగోదని కావ్యని అత్తారింట్లో కొన్నాళ్ళు వుండమన్నారు. నెల రోజులైంది ఇప్పటికి ఏ ఫోన్ లేదు.

పైగా ఆంటీ అని పిలిపించుకునే అత్తగారు తనేదో తప్పు చేసినట్టు మొహం మాడ్చుకుని తిరగడం కావ్యని అయోమయానికి గురి చేస్తోంది.

మావ గారు మాత్రం ఇంట్లో వున్నంత సేపూ ఆప్యాయంగా "అమ్మా! కావ్యా" అని పిలుస్తారు. అదొక్కటే ఆమెకు వూరట.

"నువ్వు వాడిని ఏం చేశావ్?? ఆ రోజు మధ్యాన్నం ఆంటీ అడిగిన ప్రశ్నకి "నేనేం చేశాను?" అమాయకంగా అడిగింది.

"నువ్వు వాడిని ఒంటి మీద చెయ్యి వెయ్యనివ్వలేదంట కదా. పైగా మా అన్నయ్య అమెరికాలో వున్నాడు నా ఖర్చులకి వాడే ఇస్తాడు అన్నావంట కదా. వాడి మనసు విరిగిపోయింది. అందుకే హఠాత్తుగా వెళ్ళిపోయాడు నా బిడ్డ" అని రాగాలు తీయడం మొదలెట్టింది.

సురేంద్ర, రమలకి కబురు పెట్టింది ఆమె.

"మీ అమ్మాయిని తీసుకుపొండి ఏం పెంపకమో ...ఏంటో .ఒళ్ళంతా పొగరు."

ఈ మాట వినగానే రమ పెద్దగా ఏడ్చేసింది.

"మేం ఏదో అన్నట్టు ఏడుపులెందుకులెండి. వాడు మీ అమ్మాయితో కుదరదంటున్నాడు "అంది.

"లేదండీ పిల్లల మధ్య ఏదో అంతరం వచ్చి వుంటుంది. అమెరికా పంపిస్తే వాళ్ళే సర్దుకుంటారు" అన్నాడు సురేంద్ర.

"ఏమో నేను చెప్పాల్సింది చెప్పాను, ఆ తర్వాత మీ ఇష్టం" అంది.

ఎంతకీ పేపర్లు పంపకపోయే సరికి సురేంద్ర కొడుకు సాయిని వెళ్ళి కనుక్కు రమ్మన్నాడు.

రాజేష్ ఇక తప్పక పేపర్లు పంపాడు. H4 వీసా మీద శ్రావ్య అమెరికాలో అడుగు పెట్టింది.

షికాగోలో సాయి ఎయిర్ పోర్ట్ కి వచ్చి పికప్ చేసుకున్నాడు. మర్నాడు వీకెండ్ డెట్రాయిట్ లో రాజేష్ ఇంటికి తీసికెళ్ళాడు.

రాజేష్ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు, అక్కడున్న వాళ్ళకు అతను ఎక్కడవుండేదీ తెలియదన్నారు.

మొత్తానికి నానా తంటాలు పడి అడ్రెస్ కనుక్కుని చెల్లిని రాజేష్ ఇంట్లో వదిలి వచ్చాడు సాయి.

ఎందుకైనా మంచిదని కొంత డబ్బు చేతిలో పెట్టి మళ్ళీ వీకెండ్ వస్తానని వెళ్ళాడు.

"రాజేష్ ! నా వల్ల ఏమన్నా తప్పు జరిగిందా? జరిగిపోయినవన్నీ వదిలేద్దాం కొత్తగా జీవితం మొదలెడదాం ప్లీజ్" కౌగిలించుకుంది.

అందంగా యవ్వనవతి అయిన భార్య కొత్తజీవితం మొదలెడదామని కోరి చెంతకు చేరితే రాజేష్ లో ఏ స్పందనా లేదు.

ఆమెను విడిపించుకుని దూరం జరిగాడు.

"నేను రావద్దన్నా బలవంతంగా వచ్చావు. నీ ఇష్టం కానీ నా నుంచి ఏం ఆశించొద్దు" అన్నాడు.

"అదేంటి మరి పెళ్ళి ఎందుకు చేసుకున్నావ్ ?"ఆవేశంగా అడిగింది.

"మా అమ్మ మూడు ముళ్ళేస్తే చాలు అంది, లేకపోతే చస్తానని బెదిరించింది చేసుకోవాల్సి వచ్చింది అంతే" తెగేసి చెప్పాడు.

ఏదో ఆశతో మరో నెల్లాళ్ళు వుంది.

కానీ కావ్యని కన్నెత్తి చూడలేదు పన్నెత్తి రాజేష్ పలకరించలేదు.

ఆడపిల్ల పక్కనే పడుకున్నా కనీసం ఒక మగాడిలా కూడా స్పందించలేదు. కావ్యకి అతను వ్యర్థుడని అర్థమైంది.

చూడటానికి వచ్చిన సాయితో అంది "అన్నా! నీతో తీసికెళ్ళిపో" అని అతనితో వెళ్ళిపోయింది.

కావ్య ఐల్స్ కి ప్రిపేర్ అయ్యింది. చికాగోలో ఎంఎస్ జాయిన్ అయ్యింది.

ఇండియాలో మధ్యవర్తులను పెట్టి కట్నం డబ్బు, నగలు రాబట్టుకున్నారు.

**ఇప్పుడు కావ్య పెళ్ళయిన కన్య.**

(వచ్చేనెల మరో కథ)

Post your comments